సాక్షి ఒడిశా

మంగళవారం । 21 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,38,203లు, బంగారం 4 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 179 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పేట్రేగిపోతున్న మాఫియా

రామగిరి కొండల్లో అక్రమ తవ్వకాలు పెరుగుతున్నాయి. జేసీబీలతో తవ్వేస్తున్నారు.

- 8లో



పిడుగుపాటుకు మహిళ మృతి

రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ పరిధి నకిటిగుడ గ్రామంలో పిడుగు పడి మహిళ ప్రాణాలు కోల్పోయింది.

- 8లో

అద్వితీయంగా..



ఓటు వేయడానికి వేచి ఉన్న మహిళలు

- రాష్ట్రంలో సజావుగా రెండో దశ ఎన్నికల పోలింగ్
- పలు కేంద్రాల్లో మొరాయించిన ఈవీఎంలు
- సమగ్ర పోలింగు 60.72 శాతం
- సువర్ణపూర్ జిల్లాలో అత్యధిక పోలింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండో దశ ఎన్నికలు దాదాపు ప్రశాంతంగా ముగిశాయి. అక్కడక్కడ స్వల్ప అవాంఛనీయ సంఘటనలు మినహా పోలింగు విజయవంతమైంది. ఈ దశలో 5 లోక్ సభ స్థానాలతో అనుబంధ 35 శాసన సభ నియోజక వర్గాల్లో పోలింగు నిర్వహించారు. ఈ సందర్భంగా బర్‌గడ్, బొలంగీరు, బౌద్, గంజాం, ఝార్సుగుడ, కంధమల్, నయాగడ్, సువర్ణపూర్, సుందరగడ్ జిల్లాల్లో ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ మినహా సమగ్ర పోలింగు 60.72 శాతం నమోదు కాగా సువర్ణపూర్ జిల్లాలో అత్యధికంగా 69.73 శాతం పోలింగు నమోదైంది. బర్‌గడ్ లోక్ సభ నియోజక వర్గంలో అత్యధికంగా 66.14 శాతం పోలింగ్ జరిగింది. మిగిలిన 4 పార్లమెంటరీ నియోజక వర్గాల్లో అసికా 55.65 శాతం, బొలంగీరు 61.35 శాతం, కంధమల్ 57.46 శాతం మరియు సుందర్‌గడ్ పార్లమెంటరీ నియోజక వర్గంలో 62.36 శాతం పోలింగు రికార్డు అయినట్లు ఎన్నికల సంఘం వర్గాల సమాచారం.

అంతా ప్రశాంతం..

ఒడిశాలోని 5 లోక్‌సభ నియోజక వర్గాలు, వాటి పరిధిలోని 35 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. అసికా, బర్‌గఢ్, బొలంగీర్, కంధమల్, సుందర్‌గఢ్ లోక్ సభ నియోజక వర్గా లు, వాటి పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలింగ్ విజయవంతంగా నిర్వహించారు. 5 లోక్ సభ స్థానాల పోటీలో ఉన్న 35 మంది ఎంపీలు, 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 265 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు నిర్ణయించారు. ప్రముఖ అభ్యర్థుల్లో హింజిలి, కంటాబంజీ శాసన సభ నియోజక వర్గాల నుంచి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్ర మంత్రి జుయల్ ఓరమ్, మాజీ టీం ఇండియా హాకీ కెప్టెన్ దిలీప్ టిర్కీ ఉన్నారు. 39.35 లక్షల మంది మహిళలు, 851 మంది తృతీయ లింగ వ్యక్తులు సహా మొత్తం 79.69 లక్షల మంది అర్హులైన ఓటర్ల కోసం 9,162 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు. సాయంత్రం వరకు పోలింగ్ నిరవధికంగా కొనసాగింది.

మొరాయించిన ఈవీఎం

రెండో దశ పోలింగ్‌లో అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్ కేంద్రాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈవీఎంల మార్పిడి నేపథ్యంలో పోలింగు ప్రక్రియ కాసేపు స్తంభించింది. దీని ప్రభావంతో వివిధ పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ ఆలస్యమైంది. బర్‌గడ్ నియోజక వర్గం హట్బాపాడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బూత్ నంబర్ 92 భంజనగర్‌లోని జొగామొరి పోలింగు కేంద్రంలో బూత్ నంబర్ 106, సోన్‌పూర్ జిలా బినికా తహసిల్ సిలాటి వద్ద బూత్ నంబర్ 64లో ఓటింగ్ ప్రభావితమైంది. బొలంగీరు అసెంబ్లీ సెగ్మెంటు దేవ్‌గాంవ్ మండలం కొచ్చార్‌పల్లి 153వ నంబరు పోలింగు కేంద్రం, బీరమహరాజ్ పూర్ అసెంబ్లీ నియోజక వర్గం బఘిమొరి 217వ నంబరు ఆదర్శ పోలింగు కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. సన్నాఖిముండి నియోజక వర్గం ధరాకోట్ మండలం సుందురాపల్లి గ్రామం 47, 48 నంబర్ల పోలింగు కేంద్రాలు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పోటీ చేస్తున్న కంటాబంజి శాసన సభ స్థానంలో 6 పోలింగు కేంద్రాల్లో పోలింగు ఆలస్యంగా ఆరంభమైంది. మొరాయించిన ఈవీఎంల బదులుగా కొత్తవి తెచ్చి ఏర్పాటు చేసేంత వరకు ఓటు వేసేందుకు ఓటర్లు గంటల తరబడి బారులు తీరాల్సి వచ్చింది. ఓటర్ల తీవ్ర నిరసనతో పలు చోట్ల పోలింగు అధికారులు, సిబ్బంది స్వల్ప ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన యువతరం

జిల్లాలవారీగా రెండో విడత పోలింగ్ శాతం

జిల్లా	పోలింగ్ శాతం
బర్‌గడ్	65.48
బొలంగీరు	58.38
బౌధ్	58.90
గంజాం	54.81
ఝార్సుగుడ	67.91
కంధమల్	58.21
నయాగడ్	63.20
సువర్ణపూర్	69.73
సుందరగడ్	62.27

పోలింగ్ జరిగిన 35 శాసన సభ స్థానాల్లో సోన్‌పూర్ శాసన సభ స్థానంలో అత్యధికంగా 71.35 శాతం, సురోడా అసెంబ్లీ సెగ్మెంటులో అతి తక్కువగా 47.80 శాతం పోలింగ్ జరిగింది.

శాసన సభ స్థానం	పోలింగ్‌శాతం	కవిసూర్య నగర్	56.66
అసికా	53.16	కంటాబంజి	55.15
అట్టాబిరా	67.00	కొంటామల్	55.30
బలిగూడ	58.10	ఖల్లికోట్	58.23
బర్‌గడ్	65.11	లొయిసింగ	58.45
భంజనగర్	49.10	పదంపూర్	65.32
భట్లీ	65.23	పట్నాగొడా	60.10
బిజేపూర్	64.80	ఫుల్బాణి	59.25
బీరమిత్రపూర్	68.61	పాలొసారా	58.66
బీరమహరాజ్‌పూర్	67.80	రఘునాథపల్లి	58.25
బొలంగీరు	56.10	రాజ్‌గంగపూర్	57.58
బొణాయి	68.25	రార్కెలా	55.16
బౌధ్	62.56	సన్నాఖిముండి	57.39
బ్రజ్ రాజ్ నగర్	67.42	సోన్‌పూర్	71.35
దసపల్లా	63.20	సుందరగడ్	62.00
జి. ఉదయగిరి	57.29	సురొడా	47.80
హింజిలి	57.21	తొలొసారా	65.09
ఝార్సుగుడ	68.37	టిట్లాగడ్	61.91

అస్కాలో పోలింగ్ ప్రశాంతం

పర్లాకిమిడి(అస్కా): రాష్ట్రంలో రెండో విడత ఎన్నికల పోలింగ్‌లో భాగంగా గంజాం జిల్లా అస్కాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇక్కడ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి అనితా శుభదర్శినీ, రంజితా సాహు (బీజేడీ), కాంగ్రెస్ అభ్యర్థిగా దేబకాంత శర్మ, సీపీఐ నుంచి రామకృష్ణ పండా పోటీచేస్తున్నారు. అస్కా అసెంబ్లీ స్థానం నుంచి ఆరుగురు పోటీలో ఉన్నారు. బీజేడీ నుంచి మంజులా స్వయిని, కాంగ్రెస్ నుంచి సురభి బిశోయి, సరోజ్‌కుమార్ పాడి(బిజేపీ), సీపీఐ(ఎం.ఎల్) రామచంద్ర బడత్యా, ఒడిశా జనతా పార్టీ అభ్యర్థిగా సూర్యకాంత బెహేరా, ఇండిపెండెంట్‌గా దిగంబర బెహేరాలు పోటీలో ఉన్నారు.



అస్కా నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు



అస్కా లోకసభ, అసెంబ్లీ స్థానాలకు బారులు తీరిన ఓటర్లు



సుందరగడ్ అసెంబ్లీ సెగ్మెంటు పోలింగ్ కేంద్రంలో సొమ్మసిల్లిన మహిళా ప్రిసైడింగు అధికారి



సన్నాఖిముండి నోడల్ ఉన్నత విద్యాలయంలో పర్యావరణ మిత్ర పోలింగ్ కేంద్రం



ఈవీఎం మొరాయింపుతో పోలింగ్ కేంద్రం ఆవరణలో బారులు తీరిన ఓటర్లు

న్యూస్‌రీల్

నీటిశుద్ధి యంత్రం వితరణ



నీటి శుద్ధి యంత్రంతో మహిళా మండలి ప్రతినిధులు

రాయగడ: జేకేపేపర్ మిల్ మహిళా మండలి అధ్యక్షురాలు శ్వేత ద్వివేది, ఉపాధ్యక్షురాలు నీతా ద్వివేదిల ఆధ్వర్యంలో జిల్లాలోని కొలనార సమితి దుందులి పంచాయతీలో ఉన్న పార్వతీనగర్ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు నీటిశుద్ధి యంత్రాన్ని వితరణ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు చల్లని తాగునీరు అందించేందుకు దీనిని వితరణ చేసినట్టు అధ్యక్షురాలు శ్వేత తెలియజేశారు. దీని ద్వారా ట్రస్టులోని 156 మంది విద్యార్థులకు మంచి నీరు చేరువ అవుతోందన్నారు. ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను తరచూ తమ మహిళ మండలి చేస్తుందన్నారు. ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వాహకురాలు అహల్యనాథ్ మహిళ మండలికి ధన్యవాదాలను తెలియజేశారు.

జూన్ 7 నుంచి అగ్నిగంగమ్మ ఉత్సవాలు



అగ్నిగంగమ్మ అమ్మవారు

రాయగడ: స్థానిక పిట్టలవీధిలో పూజలందుకుంటున్న అగ్నిగంగమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు జూన్ ఏడో తేదీ నుంచి ప్రారంభమవుతాయి. మందిరం ప్రాంగణంలో ఆదివారం జరిగిన కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఐదురోజులు జరగనున్న ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సమావేశంలో చర్చించారు. అమ్మవారి నిత్యపూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలాఉండగా అమ్మవారి వార్షిక ఉత్సవాలను హిందువులు, ముస్లిం సోదరులు కలిసి నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం.

రొండాపల్లి, సనకావిడి ప్రాంతాల్లో ఎలుగుబంట్ల హల్‌చల్



రొండాపల్లి ప్రాంతంలో తిరుగుతూ సీసీ కెమెరాలో కనిపించిన ఎలుగు బంటి

జయపురం: జయపురం సమితి రొండాపల్లి పంచాయతీలో రొండాపల్లి, సనకావిడి గ్రామాల్లో ఎలుగు బంట్లు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయపడుతున్నారు. గత రాత్రి రొండాపల్లి గ్రామంలో ఒక ఎలుగు బంటి తిరుగుతున్న దృశ్యాలు ఆ గ్రామంలో ఒక దుకాణంలో గల సీసీ కెమెరాలో కనిపించాయి. గత కొన్ని నెలలుగా జయపురం సమితి ఎకంబా, అంబాగుడ, సింధిగాం, జయపురం రైల్వే స్టేషన్, జయపురం విమానాశ్రయం, సొరాగుడ, గగణాపూర్ తదితర ప్రాంతాల్లో ఎలుగుల సంచారం కనిపిస్తోంది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఉత్సాహంగా ఒలింపియాడ్ పోటీలు



మాట్లాడుతున్న విద్యాధికారి చందన నాయిక్

జయపురం:

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేషనల్ యోగా ఉత్సవాల్లో భాగంగా జయపురం బ్లాక్ స్థాయి యోగా ఒలింపియాడ్ పోటీలను సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జయపురం బ్లాక్ విద్యాధికారి చందన కుమార్ నాయిక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాశ చంద్రపట్నాయక్, క్రీడా ఉపాధ్యాయుడు నరేష్ షాడంగిలు యోగా ఒలింప్ యాడ్ ప్రాధాన్యత, పోటీల నిర్వహణపై వివరించారు. మున్సిపాలిటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ఉపాధ్యాయిని నళిణీ మహాపాత్రో, ఉమ్మిరి గ్రామం ఎస్ఎస్‌డీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా టీచర్ రతిష్ రంజన్ స్వైయ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలు త్వరలో జరుగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వరంజన్ గౌఢ, దుర్గా ప్రసాద్ పాత్రో, ప్రభాకర మహారాణ, ఉపాధ్యాయినులు ప్రభాతి పాణిగ్రాహి, పపిత ప్రధాన్, నాగేశ్వరీరావు, ఎ.మురళి పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

300 యూనిట్ల వరకు కరెంటు ఫ్రీ

- రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ హామీ

భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం హామీ ఇచ్చారు. అంగుల్ స్టేడియంలో భారీ ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఒడిశా అసెంబ్లీలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకునేందుకు రూ.75 వేల సబ్సిడీని వినియోగదారులకు బీజేపీ ప్రభుత్వం అందజేస్తుందని, 300 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం నిష్క్రమించబోతోందని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఖనిజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర పరిస్థితికి బాధ్యులెవరని ప్రశ్నించారు. కొందరు అవినీతిపరులు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని, నివాసాన్ని ఆక్రమించారని, సాధారణ బీజేడీ కార్యకర్తలు కూడా ఇప్పుడు కోటీశ్వరులుగా మారారని ప్రధాన మంత్రి తెలిపారు. పాలక బీజేడీపై విమర్శలు గుప్పించిన మోదీ ఖనిజ వనరుల ప్రయోజనాలను ప్రజలు పొందకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరోధించిందని ఆరోపించారు. 2014లో మోదీ కొత్త ఖనిజ అన్వేషణ విధానాన్ని రూపొందించారని, దీని కింద ఒడిశాకు అధిక రాయల్టీ లభిస్తుందని చెప్పారు.

పూరీలో భారీ రోడ్ షో

సోమవారం పూరీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారీ రోడ్ షో నిర్వహించారు. ప్రధాన మంత్రిని చూసేందుకు బొడొదండొ దారి పొడవునా జనం బారులు తీరారు. శ్రీ మందిరం సింహ ద్వారం నుంచి మెడికల్ చౌక్ వరకు రోడ్ షో నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన మంత్రి శ్రీ జగన్నాథ ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. రోడ్ షోలో ప్రధాని వెంట రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి సంబిత్ పాత్ర, పూరీ ఎమ్మెల్యే అభ్యర్థి జయంత షడంగి ఉన్నారు. బొడొదండొ ఇరు వైపుల బారికేడ్ల ఏర్పాటుతో రద్దీ నియంత్రించారు. బీజేపీ మద్దతుదారులు మోడీ పోస్టర్లు, బీజేపీ జెండాలను పెద్ద ఎత్తున ప్రదర్శించారు.



రోడ్ షోలో ప్రధాన మంత్రి అభివాదం



శ్రీ జగన్నాథుని దర్శించుకుని సింహ ద్వారం గుండా బయటకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



ప్రధాని రోడ్ షోతో కిక్కిరిసిన బొడొదండొ మార్గం

న్యూస్‌రీల్

24న ఎచ్చెర్ల ఐటీఐలో జాబ్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్.సుధాకరరావు తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలో సోమవారం వివరాలు వెల్లడించారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. 13 ప్రైవేటు కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని వివరించారు. నెల్లూరుకు చెందిన అల్‌స్టోం, సుజు మోటార్స్, ఇన్‌ఫ్లామ్, డికో, ఏసెన్, అనంతపురానికి చెందిన హ్యుందాయ్, ఏసీటీ, కెఐఎంఎల్, కేఎస్‌హెచ్, డీఎస్, సోయన్, సాంగో తిరుపతికి చెందిన డిక్సన్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. మొత్తం 550 ఉద్యోగాల వరకు కల్పిస్తారని అన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులని తెలిపారు. రూ.15 వేల నుంచి రూ. 18 వేల వరకు నెల వారీ వేతనం ఉంటుందని అన్నారు. 10వ తరగతి, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో హాజరు కావాలని అన్నారు. ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు, రెండు బయోడేటా పత్రాలుతో హాజరు కావాలని సూచించారు. ఫోన్ నంబర్లు 9959353636, 6304033963 సంప్రదించాలని సూచించారు.

'ప్రత్యేక అవసరాల పిల్లలపై దృష్టి'



బడి బయట ఉన్న దివ్యాంగుల పిల్లలను పరిశీలిస్తున్న బుడుమూరు గోవిందరావు

జలుమూరు: ప్రత్యేక అవసరాల గల పిల్లలపై దృష్టి సారిస్తున్నామని జిల్లా సహిత విద్యా విభాగం కో ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు తెలిపారు. ఆయన సోమవారం జలుమూరు మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగ పిల్లల సర్వే నిర్వహించారు. బడి బయట ఉన్న 0 నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించి వాళ్లకి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు విద్య సహా కో ఆర్డినేటర్ ఉమా మహేశ్వరి, రమేష్, కృష్ణ ప్రసాద్ తదితరులున్నారు.

ఆదివాసీల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ జగన్నాథపురం గిరిజన గ్రామంలో సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరరావు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. గిరిజన గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లా నుంచి 36 జట్లు పాల్గొననున్నాయని తొలి మ్యాచ్ జగన్నాథపురం, బురుజువాడ టీంల మధ్య జరిగినట్లు ఆయన తెలిపారు.

'క్రీడలతో గుర్తింపు సాధ్యం'

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ స్థాయిలో గౌరవం, గుర్తింపు క్రీడలు, కళలతోనే సాధ్యపడుతుందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడామైదానం వేదికగా జరుగుతున్న జిల్లా యూత్ బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్ల శిక్షణ శిబిరాల్లో రాణించిన క్రీడాకారుల తుది జట్లను సోమవారం ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు విజయవాడ వేదికగా జరిగే 7వ ఏపీ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్లు జిల్లా కేంద్రం నుంచి పయనమై వెళ్లాయి. వీరికి రానుపోను ఖర్చుల కోసం అవసరమైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెస్సార్ అందజేశారు. క్రమశిక్షణగా ఆడి తుది వరకు పోరాడాలని ఆయన క్రీడాకారులకు పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు, సంఘానికి గౌరవాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్య నిర్వహక కార్యదర్శి, డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఎన్నికల సమయంలో డ్యూటీ పీరియడ్‌గా పరిగణించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సిబ్బంది రెమ్యూనరేషన్ డ్యూటీ సర్టిఫికెట్లతో పాటు వేసవి సెలవులు కావునా ఆ సమయంలో డ్యూటీ పీరియడ్‌గా పరిగణించాలని పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ సంఘాలకు చెందిన నాయకులు సోమవారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆయన చాంబర్‌లో వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సదాశివుని శంకరరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు తంగి మురళీమోహనరావు, ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బైరి అప్పారావు, రాష్ట్ర సహాధ్యక్షులు పి.రాజశేఖర్ రావు, బి.రవికుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరణం సీతరాజు తదితరులు ఉన్నారు.

పేట్రేగిపోతున్న మాఫియా!

- రామగిరి, శిఖాజోల కొండల్లో అక్రమ తవ్వకాలు



జేసీబీతో కొండను తవ్వేస్తున్న దృశ్యం



రాళ్లను పేల్చిన అనంతరం ఛిద్రమైన కొండ

రాయగడ: జిల్లాలోని రామనుగడ తహసీల్ పరిధి గులుండి పంచాయతీలోని రామగిరి, శిఖాజోల ప్రాంతాల్లోని కొండలు రాళ్ల మాఫియా చేతిలో చిక్కుకున్నాయి. కొంతమంది అక్రమార్కులు ఎటువంటి లీజ్, ప్రభుత్వ అనుమతులు లేకుండా కొండలను తవ్వేసి విలువైన రాళ్లను అక్రమంగా తరలిస్తున్నారు. రోజూ కనీసం 50 నుంచి 60 వాహనాల్లో ఇక్కడ నుంచి అక్రమంగా రాళ్లను రవాణా చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జేసీబీ, ఇతర మెషీన్లతో సహాయంతో రాళ్లను తవ్వేసి అక్రమ రవాణా చేస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రామగిరి, శిఖాజోల గ్రామాలతో పాటు మరికొన్ని ఆదివాసీ ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ గల కొండలను మాఫీయాలు నిత్యం పేలుడు పదార్థాలను ఉపయోగించి కొండలను పేల్చి తమ పనులు నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. నిత్యం కొండలను పేలుస్తుండటంతో సమీప గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పేలుడు ధాటికి పెద్ద పెద్ద రాళ్లు ఇళ్లపై పడుతుండడంతో ధ్వంసమవుతున్నాయని చెబుతున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తోందనే భయంతో బతుకుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై రామనగుడ తహసీల్దార్ నిర్మల చంద్ర సాహు వద్ద ప్రస్తావించగా.. గతంలో వీటి పరిశీలన బాధ్యత తహసీల్ అధికారులు చూసుకునేవారన్నారు. అయితే ప్రస్తుతం ఆయా పనులను ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ) విభాగం చూస్తుందని చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇలా ప్రభుత్వ సంపదను దొచే వారిపై తగు చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖ అధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

నైరుతి ఆగమనం

- జూన్ 15 నాటికి రాష్ట్రానికి రుతు పవనాల తాకిడి

భువనేశ్వర్: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది జూన్ 15 నాటికి రాష్ట్రానికి తాకే అవకాశం ఉంది. నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాలకు, దక్షిణ అండమాన్ సముద్రం, దక్షిణ బంగాళా ఖాతం, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతానికి రుతుపవనాలు పురోగమించాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్థానిక వాతావరణ కేంద్రం డైరెక్టర్ మనోరమ మహంతి తెలిపారు.

గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వాతావరణం ప్రభావంతో నైరుతి రుతుపవనాలు మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలు, దక్షిణ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించాయని ఆమె చెప్పారు. ఈ నెల 31న కేరళ మీదుగా రుతుపవనాలు మరింత పుంజుకుంటాయని ఐఎండీ అంచనా వేసింది. రుతుపవనాలు గత ఏడాది జూన్ 8న కేరళ తీరాన్ని తాకి 7 రోజుల ఆలస్యంగా జూన్ 22న ఒడిశా తీరానికి తాకాయి. అయితే, ఈసారి వివిధ వాతావరణ నమూనాలు అంచనా ప్రకారం రుతుపవనాలు సాధారణ సమయంలో ఒడిశాతో సహా భారత ప్రధాన భూభాగాన్ని తాకుతాయని భావిస్తున్నారు.

సాధారణంగా, రుతుపవనాలు అండమాన్ సముద్రంలో ప్రవేశించిన తర్వాత తుఫాను లేదా అల్పపీడనం ఏర్పడకపోతే సకాలంలో రుతుపవనాల పురోగమనం పుంజుకుని కేరళ, రాష్ట్ర తీరం తాకే అవకాశం ఉంటుందన్నారు.

ఈ నెల 22 నాటికి బంగాళాఖాతంలోని నైరుతి ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ప్రాథమిక దశలో ఈశాన్య దిశగా పయనించి వాయుగుండం ఏర్పడే అవకాశం లేదని మనోరమా మహంతి తెలిపారు. అయితే ఈ నెల 21 వరకు రాష్ట్రంలో ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉంటుందని డైరెక్టర్ తెలిపారు. కోస్తా ప్రాంతంలో తేమ ఎక్కువగా ఉన్నందున అంతర్గత, పశ్చిమ ఒడిశాలో అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. ఫలితంగా వేడి మరియు తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. దక్షిణ కోస్తాలోని కొన్ని ప్రాంతాలు కాల వైశాఖి అనుభవిస్తాయని మహంతి తెలిపారు.

39 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న ఔత్సాహికులు



శిబిరంలో సత్య సేవా సమితి సభ్యులు

జయపురం: స్థానిక ఎంజీ రోడ్డులోని సత్య సాయి బాబా మందిరంలో సత్య సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం పది గంటలకు ప్రారంభించిన శిబిరం మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగింది. శిబిరంలో 39 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. శిబిరంలో సత్యసాయి సేవా సమితి భక్తులు, సభ్యులు పాల్గొన్నారు. జయపురం సబ్‌డివిజన్ రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో మాట్లాడుతూ.. రక్తదానం మహత్తర దానమన్నారు. మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్నవారికి అమృత బిందువై కాపాడుతోందన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి సమాజానికి సహకరించాలని పిలుపునిచ్చారు. శిబిర నిర్వహణలో సేవా సమితి కోఆర్డినేటర్ కె.మోహన ఆచారి, సభ్యులు కె.మార్కెండేశ్వర్, పి.రామప్రసాద్ పట్నాయక్, ఎస్.రవిశంకర్, ఎస్.స్వర్ణలత, కనక దాస్ ప్రధాన భూమిక పోషించారు. కార్యక్రమంలో జయపురం బ్లడ్‌బ్యాంక్ అధికారి డాక్టర్ సూర్య శేఖర మిశ్ర, టెక్నీషియన్లు ప్రమోద్ ఖొర, గురు పోరజ, ప్రతిభా పాత్ర సహకరించారు. ఈ సందర్భంగా డా.సూర్య శేఖర మిశ్ర మాట్లాడుతూ.. బ్లడ్‌బ్యాంకులో రక్తం కొరత ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇటువంటి శిబిరాలు ఎక్కువ నిర్వహించాల్సి ఉందన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించిన సత్యసాయి సేవా సమితి సభ్యులను అభినందించారు.

25 నుంచి ధాన్యం మండీ ప్రారంభం



రైతు సచేతన రథాన్ని ప్రారంభించిన ఆర్ఎంసీ అధికారులు

జయపురం: జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశం నిర్ణయం మేరకు ఈ నెల 25 నుంచి రబీ ధాన్యం మండీలు తెరవనున్నారు. జయపురం రెగ్యులేటింగ్ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం సచేతన రథం ప్రారంభించారు. ఈ రథం సబ్ డివిజన్ పరిధిలో అన్ని ప్రాంతాలకు వెళ్తుందని, మండీలోని సదుపాయాలను రైతులకు వివరిస్తుందని ఆర్ఎంసీ అధికారులు పేర్కొన్నారు. ఏయే ప్రాంతాల రైతులు ఆయా ప్రాంతాల్లో మండీలకు ధాన్యం తీసుకువెళ్లి విక్రయించవచ్చని, స్వయం సహాయక గ్రూపులు, పాణి పంచాయతీలకు కొనుగోలుకు అనుమతించినట్లు వెల్లడించారు. మండీల్లో నిర్దేశిత సమయంలోనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని స్పష్టం చేశారు. టోకెన్ ఉన్న రైతులే రావాలని, టోకెన్ లేకపోతే కొనుగోలు కుదరదని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు వారి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారని వెల్లడించారు. ఈ ఏడాది ఎఫ్ఏక్యూ సాధారణ ధాన్యం క్వింటాకు రూ.2,183కు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



సలాయి మృతదేహం

రాయగడ: పిడుగు పడి మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ పరిధి నకిటిగుడ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతురాలుని సనొమటికొన గ్రామానికి చెందిన డొంబురు మాఝి భార్య సలాయి మాఝి (35)గా గుర్తించారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం సలాయి ఇంట్లో ఉంది. అదే సమయంలో వర్షం కురవడంతో సమీపంలోని నకిటిగుడ అడవులకు మామిడి పండ్లు పడతాయని వెళ్లింది. వర్షం మరింత పెరగడంతో పక్కనే ఉన్న చెట్టు కింద నిలబడింది. అదే సమయంలో పిడుగు పడడంతో అక్కడిక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు వెళ్లి చూడగా విగతురాలైన సలాయి పడి ఉంది. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



సంఘటన స్థలంలో ఆవు మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బోదిలి పంచాయతీలో నివాసముంటున్న సునీల్ కుమార్ బైద్యో అనే వ్యక్తి కరెంటు లైన్ కోసం గోతులు తీసి ఎర్త్ కోసం ఇనుప వైర్ ఏర్పాటు చేశారు. అయితే మేత కోసం వెళ్లిన ఆవుకు వైర్ తగలడంతో షాక్‌తో మృతి చెందింది. గ్రామ ప్రజలు ఎంత ప్రయత్నం చేసినా ఆవును కాపాడుకోలేకపోయారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే ఇలా జరిగింది బాధితుడు ఆరోపిస్తున్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాడు.

బర్‌గడ్‌లో ఆటో రిక్షా డ్రైవర్ హత్య

భువనేశ్వర్: బర్‌గడ్ జిల్లా సదర్ పోలీసు ఠాణా పరిధిలోని సారొసారా గ్రామంలో సోమవారం ఉదయం ఆటో రిక్షా డ్రైవర్‌పై సాయుధులైన వ్యక్తులు దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఎన్నికల పోలింగ్ జరుగుతున్న తరుణంలో ఈ హత్య జరగడంతో జిల్లావ్యాప్తంగా కలకలం రేగింది. మృతుడు బిస్వనాథ్ మిర్ధాగా గుర్తించారు. సారొసారా గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్‌లో పోలింగ్ జరుగుతుండగా, పదునైన ఆయుధాలతో ఒక గుంపు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసింది. ఓటర్లను తన ఆటో రిక్షాలో పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న బిశ్వనాథ్ అగంతకులను ఎదురు తిరగడంతో దారుణంగా కొట్టారు. వారిలో ఒకరు ఆటో రిక్షా డ్రైవర్‌పై భుజాలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బిశ్వనాథ్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించగా అతను చనిపోయినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. ఘోరమైన సంఘటన జరిగిన వెంటనే ఇన్‌స్పెక్టర్ జనరల్ హిమాన్షు లాల్, బర్‌గడ్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ప్రహ్లాద్ సాయి మీనా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారిని శాంతింపజేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఓటు వేసిన ప్రముఖులు



చూపుడు వేలిపై ఓటు బొట్టుని ప్రదర్శిస్తున్న జుయల్ ఓరం



ఓటు వేస్తున్న దిలీప్ టిర్కీ



కుటుంబీకులతో కలిసి ఓటు వేసిన దిలీప్ రాయ్

భువనేశ్వర్: రాష్ట్రంలో సోమవారం జరిగిన రెండో దశ పోలింగ్‌లో మహామహులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు సంబంధిత కేంద్రాల్లో ఓటు వేశారు. సుందరగడ్ జిల్లా బొణాయి శాసన సభ నియోజక వర్గం లోహుణిపాడా మండలం కొలైపాషా పంచాయతీ కెందుడిహ గ్రామం పోలింగు కేంద్రంలో ఎంపీగా పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి జుయల్ ఓరం ఓటు వేశారు. రౌర్కెలా నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి దిలీప్ రాయ్ తన కుటుంబీకులతో కలిసి ఓటు వేశారు. భార్యతో కలిసి దిలీప్ టిర్కీ ఓటింగులో పాల్గొన్నారు. బిజూ జనతా దళ్ అభ్యర్థిగా ఈ విడత ఎన్నికలో సుందరగడ్ పార్లమెంటు స్థానం కోసం పోటీ చేస్తున్నారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు జొగొదా ప్రాంతం 66వ నంబరు పోలింగు కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వడదెబ్బకు గురైన పోలింగ్ అధికారి



అధికారిని చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పోలింగ్ విధుల్లో అధికారి వడ దెబ్బకు గురయ్యాడు. రౌర్కెలా బాసంతి కాలనీ బాసుదేవ్ విద్యామందిర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈ విచారకర సంఘటన చోటు చేసుకుంది. పోలింగ్ కార్యకలాపాలు పర్యవేక్షిస్తుండగా బాధిత అధికారి వేడిమి తాళలేక సొమ్మసిల్లి పడి గోడకు తగలడంతో తలకు బలమైన గాయమైంది. అందుబాటులో ఉన్న ఏజెంట్లు హుటాహుటిన ఆయనకు సత్వర చికిత్స కోసం రౌర్కెలా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత పోలింగ్ అధికారి రవీంద్ర కుమార్‌గా గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రంలో సాధారణ పంకాలు తప్ప ఇతరేతర శీతల సదుపాయాలు, ఛాయా శిబిరాలు లేనందున ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు మండుటెండలో ఇబ్బందులు పడినట్లు ఆరోపించారు.

వృద్ధుడిపై ఎలుగుబంటి దాడి



ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న త్రినాథ్ గౌడ.

జయపురం: పొలం పనులకు వెళ్తున్న ఓ వృద్ధుడిపై ఎలుగు బంటి దాడికి తెగబడింది. దాడిలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బొయిపరిగుడ పోలీసు స్టేషన్ పరిధిలోని జి.మఝిగుడ పంచాయతీ నగియగుడ గ్రామ వాసి త్రినాథ్ గౌడ(60) సోమవారం ఉదయం పొలంలో దుక్కు దున్నేందుకు బయల్దేరారు. ఎద్దులు, నాగలితో పొలానికి వెళ్లారు. అయితే దారిలో అకస్మాత్తుగా ఒక ఆడ ఎలుగు బంటి, ఒక పిల్ల ఎలుగుబంటి ఆ ప్రాంతానికి వచ్చాయి. త్రినాథ్‌ను చూసిన తల్లి ఎలుగుబంటి అతడిపై దాడికి దిగింది. దాడిలో త్రినాథ్ ఎడమ చేయికి గాయమైంది. అతడి హాహాకారాలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు రావడంతో వారిని చూసి ఎలుగులు పారిపోయాయి. గాయపడి ఉన్న త్రినాథ్‌ను వారు ఆస్పత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య..?

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంపీవీ 41 గ్రామంలో ఒక యువకుడు గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని అనుమానాస్పదంగా ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి గ్రామానికి చెందిన అగ్ని దాస్ కుమారుడు ప్రవీణ్ దాస్ (28) మృతదేహంగా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండా తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని కిందికి దించి కలిమెల ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రేమలో విఫలమైనందుకే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లకూడదు

భువనేశ్వర్: ఈనెల 22వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సంకేతాలు బలపడుతున్నాయి. 24 నాటికి వాయుగుండంగా పరిణమించే అవకాశం ఉన్నట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం ముందస్తు సంకేతాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మత్స్యకారులకు సముద్రంలో చేపల వేట నివారణకు ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వేట కోసం నడి సముద్రంలో ఉన్న మత్స్యకారులు తక్షణమే వెనుకకు తిరిగి వచ్చి తీరం చేరాలని తెలిపారు. ఈ ల 24వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నివారించాలని ముందస్తు సమాచారం జారీ చేశారు.

అల్పపీడనంపై కలెక్టర్లకు ఎస్ఆర్‌సీ హెచ్చరిక

భువనేశ్వర్: భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం సూచన మేరకు నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఒడిశా స్పెషల్ రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ఐఎండీ జారీ చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం ఈ నెల 22న నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది మొదట్లో ఈశాన్య దిశగా కదులుతూ, ఈ నెల 24 నాటికి బంగాళా ఖాతంలోని మధ్య భాగాలపై అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. రాష్ట్రంలోని జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ వాతావరణ వ్యవస్థ నిశితంగా పరిశీలించి పర్యవేక్షించాలని మార్గదర్శకాలు జారీ చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన ఎస్పీ

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం పరిశీలించారు. మూడంచెల భద్రత 18 స్ట్రాంగ్ రూలు వద్ద సెక్యూరిటీ పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని భద్రత సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ రోజు తీసుకోవాల్సిన చర్యలు, భద్రతపై పోలీస్ అధికారులతో చర్చించారు. కౌంటింగ్ రోజు రోడ్లు, కళాశాల ఆవరణలో ఇతరులు ఉండకుండా జాగ్రత్త పడాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి శాంతి భద్రతలు సమస్య లేకుండా పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ శృతి, సీఐ జి.రామచంద్రరావు, ఎస్సై ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా తిరుక్కల్యాణం



తిరుక్కల్యాణోత్సవంలో పూజల్లో పట్టాభిరామస్వామి

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ కోదండరామాలయం, కవిటిలో వెలసిన పట్టాభిరామాలయాల్లో వైశాఖమాస తిరుక్కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్రహ్మపురానికి చెందిన ఆగమశాస్త్ర పండితుల బృందంతో రెండోరోజు ఉత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రగడపుట్టుగ పరిసర గ్రామాలకు చెందిన 1500 మంది భక్తులకు సీతారాముల కల్యాణోత్సవ విందును ఆలయ అభివృద్ధి కమిటీ గ్రామపెద్ద బల్లెడ ఎర్రప్ప ఏర్పాటుచేశారు.

క్లుప్తంగా

శిశువుల భవిష్యత్తు నాశనం చేయవద్దు

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ అప్పారావు


బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో వారం రోజుల్లో ముగ్గురు శిశువులను వీధి కాలువలు, చెత్త కుండీల్లో వేసి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయడం చాలా దురదృష్టకరమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల పెంపకం, పోషణ, రక్షణ, సంరక్షణ కోసం ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినట్లు అయితే అటువంటి శిశువులను, బాలలను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు తమ ఆధీనంలోకి తీసుకుని వారికి రక్షణ, సంరక్షణ కల్పించనున్నట్లు చెప్పారు. అటువంటి శిశువుల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఊయలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గంజాయితో ఆరుగురు యువకుల అరెస్ట్

- 2.193 కేజీల సరుకు స్వాధీనం చేసుకున్న పోలీసులు

తెర్లాం: గంజాయితో పట్టుబడిన ఆరుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ సోమవారం తెలిపారు. ఈ ఘటనపై ఆయన అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి తెర్లాం, గరివిడి మండలాలకు చెందిన ఆరుగురు యువకులు గంజాయి పట్టుకుని వస్తుండగా పట్టుకుని పోలీసులు అరెస్ట్ చేశారు. వారంతా ఒడిశా రాష్ట్రంలోని సుంకి పరిసర గ్రామాల్లో గల కొండ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. అక్కడ నుంచి తెచ్చిన గంజాయిని ప్యాకెట్ల రూపంలో మార్చి కొంత మేరకు వినియోగించడంతోపాటు, మండలంలోని పలు గ్రామాల యువతకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో గంజాయి రవాణా, యువతకు సరఫరా చేయడంపై నిఘా వేసి ఆదివారం రాత్రి గంజాయి తీసుకుని వస్తున్న ఆరుగురు యువకులను మండలంలోని రంగప్పవలస చెరువు వద్ద పట్టుకున్నారు. వారి దగ్గర ఉన్న 2కిలోల 193 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, గంజాయితో పట్టుబడిన ఆరుగురు యువకులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించారు. ఈ కేసును బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై తెలియజేశారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం గ్రామానికి చెందిన కరెడ్ల చిన్నారావు (58) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై ఆర్.గోపాలరావు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నారావు తన పశువుల కళ్లంలో గల గడ్డివాము వద్ద ఆవుకు గడ్డి తెచ్చేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లాడు. అక్కడి గడ్డి తీస్తున్న క్రమంలో కాలిపై పాముకాటు వేసింది. అది గమనించి చిన్నారావు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ప్రథమ చికిత్స నిమిత్తం ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించారు.అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈదురు గాలులతో భారీ వర్షం


ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

భామిని: మండలంలో సోమవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. సాయంత్రం భయంకరమైన శబ్దాలతో ఉరుములు, మెరుపులు గందరగోళం సృష్టించి నానా ఇబ్బందులు కలిగించాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో ఏబీ రోడ్డు వెంబడి వర్షపు నీరు వరదలా పారగా వాహనాల రాకపోకలు, విద్యుత్ సరఫరా నిలిచిపోయాయి. వర్షం సందర్భంగా గంటల కొద్దీ జన జీవనం స్తంభించిపోయింది.

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట బాలికలు, బాలురు, పెద్దమడి బాలుర ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఒకేషనల్ గ్రూపులైన ఏఅండ్‌టి, సీజీఏలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో ఉంటుందన్నారు. విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రులు, విద్యార్థుల ఆధార్‌కార్డులు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, 6 పాస్‌పోర్ట్ ఫొటోలు, మూడు జిరాక్స్ సెట్లు తీసుకుని కౌన్సెలింగ్ సెంటర్‌కు ఆ రోజు ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని స్పష్టం చేశారు.

గిరిజనుల పంట పండింది


గిరిజనుల నుంచి కొనుగోలు చేసి వ్యాన్‌లో తరలించడానికి సిద్ధం చేస్తున్న వ్యాపారులు

- మన్యంలో పైనాపిల్ సీజన్ మొదలైంది
- ఏటా 25 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి
- 5 వేల ఎకరాల్లో సీతంపేట ఏజెన్సీలో విస్తరించిన పంట
- రూ.15, 20 పలుకుతున్న ఒక్కో పండు
- పట్టణ ప్రాంతాల్లో రూ.30 వరకు విక్రయం
- సీజన్ ఆఖరులో రూ.5కు పడిపోతున్న ధర
- ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలుతున్న పంట
- గిరిజన రైతుల ప్రధాన ఆదాయవనరు


పొలంలో పైనాపిల్ కోసి బుట్టలతో ఇళ్లకు తీసుకువెళ్తున్న మహిళలు


మార్కెట్‌కు పైనాపిల్ తరలిస్తున్న గిరిజనుడు

సీతంపేట: గిరిజన రైతుల ప్రధాన జీవనాధారమైన పైనాపిల్ సీజన్ ఆరంభమైంది. సీతంపేట ఏజెన్సీలో అత్యధికంగా ఈనెల నుంచి ఆగస్టు వరకు పంట దిగుబడి ఉంటుంది. సుమారు 5 వేల ఎకరాల్లో పంట విస్తరించి ఉంది. దాదాపు 25వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. పండు సైజును బట్టి ప్రస్తుతం రూ.15 నుంచి రూ.20 మధ్య ధర పలుకుతోంది. వారపు సంతలకు పైనాపిల్‌ను గిరిజనులు తీసుకువస్తున్నారు. గడిచిన రెండేళ్లుగా తీసుకుంటే సీజన్ ఆరంభంలో రూ.20 ధర పలికి సీజన్ ముగిసే నాటికి రూ.5కు ధర పడిపోయింది. దీంతో గిరిజనులు అవస్థలు పడ్డారు. అప్పట్లో ఐటీడీఏ చొరవ తీసుకుని గిరిజనుల వద్ద రూ.12 నుంచి రూ.15 వరకు పైనాపిల్‌ను కొనుగోలు చేసి బయట మార్కెట్‌లో విక్రయించింది. ఏజెన్సీలో కొండపోడు వ్యవసాయంలో భాగంగా మిశ్రమ పండ్ల తోటల్లో ఈ పంట అంతరపంటగా గిరిజనులు సాగు చేస్తున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన క్యూ రకం విత్తనాలు దిగుమతి చేసుకుని పంట పండిస్తున్నారు. సీతంపేట మండలంలోని కోడిశ, కుశిమి, ముత్యాలు, శంభాం, అక్కన్నగూడ, రాజన్నగూడ, జోగైనాయుడుగూడ, కోడిశ, తొత్తడి, రామానగరం, అంటికొండ, పొల్ల, దోనుబాయి, మానాపురం తదితర గిరిజన గ్రామాల్లో విస్తారంగా పైనాపిల్ తోటలను వేశారు. ఈ తోటల పెంపకానికి ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు అవసరం లేకపోవడంతో ఈ పంటపై గిరిజనుల్లో నానాటికీ ఆసక్తి పెరుగుతోంది. సీజన్‌లో గిరిజనులకు మంచి ఆదాయం వస్తుంది. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు గిరిజనులు విక్రయిస్తారు. దళారీ వ్యాపారులు సంతలకు వచ్చి పెద్దమొత్తంలో కొనుగోలు చేస్తారు. ఇక్కడ కొనుగోలు చేసిన పైనాపిల్‌కు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కోనసీమ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో మంచి డిమాండ్ ఉండడంతో లారీలు, వ్యాన్‌లలో తరలించి వ్యాపారులు అధిక లాభాలు ఆర్జిస్తారు. ఒక్కో పండుపై కనీసం రూ.5 నుంచి రూ.10 వరకు లాభంవస్తుందని వ్యాపారులు తెలిపారు. కొన్ని సందర్భాల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. వారపు సంతలకు తెచ్చిన పైనాపిల్ ఏమాత్రం నాణ్యత లోపించినా కొనుగోలు చేయరన్నారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో, శనివారం పొల్ల, కుశిమిలలో వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు వ్యాపారులు వచ్చి పైనాపిల్ పంటను కొనుగోలు చేస్తారు. కొన్ని సందర్భాల్లో సీజన్ ఆరంభంలో గిరిజనులకు ముందు అడ్వాన్స్‌లు ఇచ్చి పంటలను స్వాధీనం చేసుకోవడంతో ఇతరులెవరికీ విక్రయించడానికి అవకాశముండదని గిరిజనులు తెలిపారు.

ఐటీడీఏ చొరవతో..

గతంలో ఐటీడీఏ చొరవతో ఇతర జిల్లాల్లో 41రైతు బజార్లలో పైనాపిల్ పండ్లను రైతు సంఘాల గ్రూపుల ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకున్నారు. మధ్య దళారీ వ్యవస్థను రూపుమాపి గిరిజనులకు కాస్త ఆదాయం వచ్చే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఎఫ్‌పీవోల ద్వారా రైతుల దగ్గర నుంచి గ్రేడ్‌ను బట్టి రూ.15కు తక్కువ లేకుండా కొనుగోలు చేశారు. ఐటీడీఏ, ఉద్యానవనశాఖ, వెలుగు వంటి శాఖలు పైనాపిల్‌కు గిట్టుబాటు ధరలు కల్పించాలనే ఉద్దేశంతో గతేడాది వివిధ ప్రాంతాలకు రవాణా చేసి విక్రయించాయి. తద్వారా పైనాపిల్ సాగుచేసే రైతుల ఆదాయం మెరుగైంది.

పంట దిగుబడి బాగుంది



ఈ సంవత్సరం పైనాపిల్ పంట మంచి దిగుబడి వచ్చింది. గతేడాది కంటే దిగుబడులు బాగున్నాయి. ధరలే వారం, వారం తగ్గుముఖం పట్టే పరిస్థితులు ఉన్నాయి. ధరల్లో నిలకడ ఉండడం లేదు. రైతు బజార్లు వంటి చోట విక్రయించుకునేలా అధికారులు సహకరించాలి.

– గంగారావు, వెంకటిగూడ

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



పైనాపిల్ విషయంలో మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపడం బాగుంది. రెండేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల్లో విక్రయించే వాళ్లం. అప్పుడు మంచి ఆదాయ మార్గాలు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ఏడాదైనా పూర్తిస్థాయిలో ఇతర జిల్లాల్లో కూడా విక్రయించే వెసులుబాటు కల్పించాలి. – ఎస్.చిన్నకడాయి, బొండిగూడ

నిరంతర పర్యవేక్షణ అవసరం

- డీఎంహెచ్ఓ విజయపార్వతి


వైద్యులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ విజయపార్వతి

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, బిడ్డల ఆరోగ్య రక్షణపట్ల నిరంతర పర్యవేక్షణ అవసరమని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయ పార్వతి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె పాలకొండ మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీ పరిధి పొట్లి గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహణ తీరును ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు వైద్యులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రోజువారీ వైద్య తనిఖీలకు సిబ్బంది ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే వాటిని ముందుగానే గుర్తించాలని చెప్పారు. అందుకు అవసరమైన చికిత్సను అందించే విధానంపై వైద్యాధికారి ఎస్.రవికుమార్‌కు సూచనలు చేశారు. ఈ క్రమంలో గర్భిణులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరాతీశారు. తల్లీబిడ్డ ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

24 నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు


అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు

పార్వతీపురం: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 17 కేంద్రాలలో సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఆ కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటలనుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని, తదనుగుణంగా బస్సులు నడపాలని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరీక్షల పేపర్లు నిర్దేశిత కేంద్రాలకు పంపించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని పోస్టల్ శాఖను కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పక్కాగా ఉండాలని పోలీసు శాఖకు సూచించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ పరీక్షల జిల్లా అధికారి డి.మంజులవీణ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌టీసీ, పోస్టల్, విద్యుత్‌శాఖాధికారులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో విద్యుత్‌శాఖకు తీవ్రనష్టం

- ముమ్మరంగా విద్యుత్ పునరుద్ధరణ


విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది


స్థానిక సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లపై పడిన చెట్లను తొలగిస్తున్న లైన్‌మన్

వీరఘట్టం: గడిచిన పదేళ్ల క్రితం 2014లో సంభవించిన హుదూద్ తుఫాన్‌ను తలపిస్తూ ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఈ గాలులకు విద్యుత్ వ్యవస్థ అతలాకుతలమైంది. 11 ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు, 12 వ్యవసాయ పంపుసెట్లకు వెళ్లే విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ గోడపై రెండు స్తంభాలు పడడంతో రక్షణ గోడ కూలిపోయింది. ఈదురు గాలులకు సుమారు రూ.5 లక్షల వరకు విద్యుత్‌శాఖకు నష్టం జరిగి ఉంటుందని అంచనా వేసినట్లు ఏఈ డి.బాలాజీ తెలిపారు.తమ సిబ్బంది ఆదివారం రాత్రి నుంచి నిరంతరం పనిచేస్తూ అన్ని ఫీడర్లకు విద్యుత్ పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నందున తరచూ విద్యుత్ నిలుపుదల చేయవలసి ఉంటుందని ప్రజలు సహకరించాలని ఈఈ కోరారు.గురువారం విద్యుత్ పునరుద్ధరణ పనులను పాలకొండ ఈఈ గోపాలకృష్ణ పరిశీలించారు. ఇక్కడ జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు.

విలువలతో కూడిన బోధన అందించాలి

- సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రశాంత కుమార్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులకు విలువలతో కూడిన బోధన అందించాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రశాంత కుమార్ మహంతి సూచించారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో విద్యార్థులకు పరిశోధనలపై సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్సిటీతో ఉమ్మడి సహకార పరిశోధనలు చేసేందుకు అనిట్స్ ముందుకు వచ్చిందని చెప్పారు. అధ్యాపకులు ఏటా తమ బోధనలో 40 శాతం విలువలు జోడించి విద్యార్థులకు బోధించాలని సూచించారు. పరిశ్రమలకు నైపుణ్యం ఉన్న యువతీయువకులే అవసరమని, డిగ్రీలు ప్రధానం కాదన్నారు. అనిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ పరిశోధనల్లో వినూత్న బోధన, పాఠ్యప్రణాళిక రూపకల్పన ముఖ్యమన్నారు. కొత్త అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ సన్నీడియోల్, ఎంఎల్ఎన్ ఆచార్యులు, సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు లొకంటి సంతోష్‌కుమార్ (ఫైల్)

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశాఖపట్నం జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన లొకంటి సంతోష్‌కుమార్(32) తగరపువలస ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్సై అప్పారావు తెలిపారు. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన లొకంటి సంతోష్‌కుమార్ శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని వేగావరం గ్రామంలో ఉన్న బంధువులకు సంబంధించిన వారు చనిపోయారని చెప్పి ఆదివారం సాయంత్రం తన తల్లిని స్కూటీపై తీసుకుని వేగావరం బయలుదేరాడు. మార్గమధ్యంలో భోగాపురం మండలంలోని నారుపేట గ్రామానికి చేరుకునేసరికి స్కూటీ టైర్ పంక్చర్ కావడంతో డివైడర్‌ను ఢీకొని తల్లీకొడుకులు ప్రమాదానికి గురయ్యారు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో తగరపువలస ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా సంతోష్‌కుమార్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య లక్ష్మితో పాటు పాప ఉంది. మృతుని తమ్ముడు గోపి ఫిర్యాదు మేరకు ఏఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

589 మద్యం బాటిల్స్ ధ్వంసం

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పరిధిలో 32 కేసుల్లో పట్టుకున్న 589 మద్యం బాటిల్స్‌ను సోమవారం ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బీవీజీ రాజు ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్సై హరిబాబునాయుడు, ఎక్సైజ్ సిబ్బంది వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం బాటిల్స్‌ను ధ్వంసం చేశారు.

చదురుగుడికి సిరుల తల్లి


ఉత్సవ ర్యాలీ

- దేదీప్యమానంగా సాగిన దేవర మహోత్సవం
- మెట్టినింటికి తరలివెళ్లిన అమ్మవారు
- రథంపై వస్తున్న అమ్మవారికి దారిపొడవునా ప్రత్యేక పూజలు
- పైడితల్లి నామస్మరణతో పులకించిన విద్యలనగరం
- నేటి నుంచి ఉయ్యాల కంబాల ఉత్సవం వరకు చదురుగుడిలోనే అమ్మ దర్శనం


వనంగుడి లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: సిరుల తల్లి, ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత పైడితల్లి అమ్మవారు పుట్టినిల్లు అయిన వనంగుడి నుంచి మెట్టినిల్లుగా పిలిచే చదురుగుడికి తరలివచ్చిన వేళ భక్తులు పులకించిపోయారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు జరిపారు. అమ్మవారి రథంతో ముందుకు సాగారు. మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ సోమవారం సాగిన అమ్మవారి దేవర ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సాగిన దేవర ఉత్సవం

పైడితల్లి అమ్మవారు వనంగుడి నుంచి చదురుగుడికి చేరుకునే అద్భుత సన్నివేశాన్ని దేవరమహోత్సవంగా పిలుస్తారు. మరలా ఆరు నెలల తర్వాత అమ్మవారు జాతర జరిపించుకుని, ఉయ్యాల కంబాల మహోత్సవం మరుసటి రోజున తిరిగి వనంగుడికి చేరుకుంటారు. అమ్మవారికి ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో వేద పండితులు తాతా రాజేష్, సాయి, వెలువలపల్లి నరసింహమూర్తి, దూసి కృష్ణమూర్తి తదితరుల వేదమంత్రోచ్ఛరణాలతో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం దీపాలంకరణ గదిలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, మూలా పాపారావు, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మనవిచెప్పిన అనంతరం ఆలయం చుట్టూ ఉత్సవ విగ్రహంతో మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. అక్కడ నుంచి అప్పటికే సిద్ధంగా ఉంచిన అమ్మవారి ఉత్సవ రథంపై ఉత్సవవిగ్రహాన్ని ఆశీనులు చేశారు. మేళతాళాలు, కాళికాదేవి వేషధారణలు, చిన్నారుల కోలాటాల నడుమ అమ్మవారిని వనంగుడి నుంచి గాడీఖానా, వైఎస్సార్ సర్కిల్, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఘటాలతో అమ్మవారి పూజలు చేశారు. హుకుంపేట వాసులు అమ్మవారికి వేప, పసుపు కలిపిన నీటిని బిందెలతో తీసుకువెళ్లి చల్లదనం చేశారు. ప్రత్యేక పూజల అనంతరం రాత్రి అమ్మవారిని పెద్దచెరువు వద్దకు తరలించి అక్కడ తలయారులు, జాలరులు, పూజారులు ఘటాలకు పూజలు చేసి, అమ్మవారికి మనవి చెప్పారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి చదురుగుడిలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ ప్రసాదరావు తెలిపారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

భక్తులకు ధార గంగమ్మ పండగ పిలుపు


ఎస్.కోటలో ధారగంగమ్మ పండగ తేదీలను చాటింపు వేస్తున్న తలయారీలు


ధారగంగమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

- 27న తొలేళ్ల ఉత్సవం
- 28న అనుపోత్సవం

శృంగవరపుకోట: భక్తుల కొంగుబంగారం, ఎస్.కోట గ్రామదేవత ధారగంగమ్మ అమ్మవారి పండగకు ఆహ్వానిస్తూ ఆలయంలో సోమవారం చాటింపు కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని 1108 చీరలతో అలంకరించారు. గర్భాలయానికి ముందున్న ముఖమండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఆలయపూజారి రాజగోపాలాచార్యులు నేతృత్వంలో పూజాధికాలు చేశారు. అనంతరం చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడు అమ్మవారి చెవిలో పండగ వివరాలను వినిపిస్తూ అనుమతి కోరారు. అనంతరం 27న తొలేళ్ల ఉత్సవం, 28న అనుపోత్సవం నిర్వహిస్తామని తలయారీలతో డప్పు కొట్టించి పండగ చాటింపు వేయించారు. 22వ తేదీ బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ గ్రామంలో అమవారి ఘటాలను తిరువీధి జరుపుతారు. రాత్రివేళ కూటి ఘటాల్లో ఇళ్లలో చేసిన వంటను ముందుగా అమ్మవారి కోసం వేరుగా తీసి ఉంచి ఘటంలో వేస్తారు. వీటిని అమ్మవారి గద్దె ఇంటికి తీసుకెళ్లి అమ్మకు నివేదించిన తర్వాత అమ్మవారి ప్రసాదంగా సేవకులు పంచుకుంటారు.